Apni Islah Aap
(Telugu)

# స్వీయ సంస్కరణ

## ఆత్మపరీక్షకు మొదటి పాఠం

మూలం
**నయీమ్ సిద్దీఖి**

అనువాదం
**అబ్దుల్ వాహెద్**

అనంతకరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# ముందుమాట

ప్రపంచంలో అత్యంత కష్టమైన, సున్నితమైన పని మానవ వ్యక్తిత్వ నిర్మాణం. ఈ పని అనివార్యంగా చేయవలసిన అత్యవసరమైన పని. మానవాళి నైతికంగా ఉన్నత ప్రమాణాలు, విలువలను అవలంబించనట్లయితే ఉత్తమ సంస్కృతి వికసించడం సాధ్యపడదు. నేడు ఎల్లెడలా అలజడి, అల్లర్లు అలుము కుని ఉన్న వాతావరణంలో, జీవితాన్ని అల్లకల్లోలం చేసే కల్లోలాలు మన కుటుంబాలలోనూ, సమాజంలోనూ, చివరకు చట్టసభలలోనూ తమ ఉనికిని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో, వీటినుంచి విముక్తి పొందడానికి ఉన్న ఒకే ఒక మార్గం ఇది. మనిషి నడవడి, వ్యక్తిత్వం, అలోచనలు, విశ్వాసాలు మొదలు మనిషి రాజకీయ, సాంఘీక కార్యకలాపాలన్నింటిలోనూ విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోవాలి. మానవాళి భౌతిక సుఖలాలసల వ్యామోహాన్ని వదిలిపెట్టి దైవభీతి పరాయణత్వం నిండిన వ్యక్తిత్వాన్ని అవలంబించాలి. ఈ స్పృహ చైతన్యం ఉన్న వాళ్ళు, ప్రతి ఒక్కరు ఈ చీకట్లలో చుక్కల్లా మెరుస్తూ వెలుగులు పంచాలి.

ఒక నైతిక విప్లవం మనకు ఎంతయినా అవసరం. మన సమాజంలో అనేక రుగ్మతలు విస్తృతస్థాయిలో విస్తరించి ఉన్నాయి. వ్యక్తిగత, కౌటుంబిక, సామాజిక, రాజకీయ రంగాలలోనే కాదు, ఆఫీసుల్లో, వ్యాపార సంస్థల్లో, దేశంలోని అన్ని రంగాలలో నైతిక పతనం అలుముకుని ఉంది. ఈ పతనం ఫలితాలు స్పష్టంగానే కనబడుతున్నాయి. ఉన్నత నియమాలు, మంచి సంప్రదాయాలు, ఉన్నత ప్రమాణాలు నేడు కరువయ్యాయి. ఈ నైతిక పతనం ప్రగతికి పెద్ద ఆటంకం అయ్యింది. అందువల్ల మన శక్తిసామర్థ్యాలు వ్యర్థం అవుతున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడి సరికొత్త దశను నిర్మించడానికి మొదట చేయవలసిన పని మనలో ఒక నైతిక విప్లవాన్ని ఆవిష్కరించడం.

మనుషుల్లో నైతిక విప్లవం అన్నది కేవలం బాహ్య కారణాల వల్ల జనించదు. చట్టాలు, నియమాలు, నిబంధనలు, బోర్డులు, కమీషన్లు, ఆఫీసులు, సంస్థలు, కట్టుబాట్ల సడలింపుల ప్రయత్నాలు, న్యాయస్థానాలు, జైళ్ళు, జరిమానాలు శిక్షలు ఇవేవీ కూడా మనిషిని మంచి మనిషిగా మార్చలేవు. నైతిక విప్లవం అన్నది ఎల్లప్పుడు మనిషిలో లోపలినుంచి జనిస్తుంది. మనిషి హృదయంలో ఏదన్నా సిద్ధాంతం చోటుచేసుకోనంత వరకు, ఏదన్నా లక్ష్యం మనిషికి ప్రేరణ ఇవ్వనంత వరకు, మనిషిలో ప్రస్తుత పరిస్థితులు చెడ్డ పరిస్థితులన్న స్పృహ జనించనంత కాలం, ఈ పరిస్థితుల నుంచి బయటపడి మంచి పరిస్థితులను సాధించాలన్న కోరిక కలుగనంత కాలం అతనిలో నైతికపరంగా ఎలాంటి మార్పు చోటుచేసుకోదు. మనిషి హృదయకుహరంలో అతని అంతరాత్మ చైతన్యజ్యోతిని ప్రజ్వలనం చేయకపోతే బయటి సూర్యచంద్రుల వెలుగు కూడా ఆ చీకట్లను దూరం చేయలేదు.

మనిషి అంతరాత్మలో ఇలాంటి నైతిక విప్లవం సాధించడం ద్వారానే ఇస్లాం సమగ్ర సాంస్కృతిక విప్లవాన్ని ప్రారంభిస్తుంది. మనిషి వ్యక్తిత్వంలో మౌలిక మార్పులు రావాలని ఇస్లాం అభిలషిస్తుంది. అందుకుగాను ఇస్లాం ప్రతి మనిషిలోని అంతర్గత శక్తిసామర్థ్యాలను జాగృతం చేస్తుంది. మనిషికి ధార్మిక విశ్వాసం లాంటి సాటిలేని గొప్ప బలాన్ని ప్రసాదిస్తుంది. మనిషిలో దైవభీతి, భయభక్తుల కావలి వ్యవస్థను సృజిస్తుంది. అంతరాత్మ, మనస్సాక్షి వంటి మార్గదర్శకులను ఏర్పాటు చేస్తుంది. మంచిచెడుల విచక్షణనిచ్చే దైవిక జ్ఞానాన్ని సంక్రమింపజేస్తుంది. మనిషిని శ్రేయోసాఫల్యాల మార్గాన నడిపే శాశ్వత సంకల్పాన్ని అతనిలో సృజిస్తుంది. నేడు మనకు, పూర్తి ప్రపంచానికి ఇస్లాం కోరే నైతిక విప్లవం అవసరం. ఈ అవసరం గురించిన స్పృహతోనే ఈ చిరు పుస్తకాన్ని రాయడం జరిగింది.

**- నయీమ్ సిద్దీఖి**

# స్వీయ సంస్కరణ

ఇస్లాం ప్రకారం ప్రతి మనిషికి వ్యక్తిగతంగా తన నడవడిని చక్కదిద్దుకో వలసిన, సచ్ఛీలాన్ని నిర్మించుకోవలసిన బాధ్యత ఉంది. అయితే సామూహిక జీవనం ప్రాధాన్యాన్ని తగ్గించడం ఎంతమాత్రమూ కాదు. మనిషికి, అతని వ్యక్తిత్వం పరిపూర్ణం కావాలంటే, సరియైన సామూహిక వ్యవస్థ, పవిత్రమైన సమాజం, సంస్కారవంతమైన వాతావరణం ఎంతైనా అవసరం. కాని ప్రతికూల మైన సామూహిక వ్యవస్థలో మనిషి వ్యక్తిగతంగా, ఒంటరిగా తన వ్యక్తిత్వ సంస్కరణకు, నిర్మాణానికి పూనుకోవడం చాలా కష్టమైన పని. అలాంటి ప్రయత్నాలలో ఉండే కష్టాలు ఊహకు వచ్చినా తట్టుకోవడం కష్టం. అయినప్పటికీ, ప్రతి మనిషి దేవుని ముందు తన పనులకు తానే సమాధానం చెప్పుకోవలసి ఉంది. తానే బాధ్యత వహించవలసి ఉంటుంది. ప్రతి మనిషి తన జీవితకాలం, తనకు లభించిన శక్తి సామర్థ్యాలు, అతని నడవడి, ఆచరణల విషయమై వ్యక్తిగతంగా లెక్క చెప్పుకోవలసి ఉంది. ప్రతి మనిషి తనకు లభించిన ఈ అనుగ్రహాల పరిరక్షణ విషయంలో ఎలా వ్యవహరించాడు, వాటిని ఉపయో గించుకోవడంలో ఎంత వరకు జాగ్రత్తలు పాటించాడు, ప్రగతి వికాసాల కోసం ఆచరణాత్మకమైన పద్ధతులను ఎంత వరకు అవలంబించాడు తదితర ప్రశ్నలకు జవాబులు చెప్పుకోవలసి ఉంది. అక్కడ దేవుని న్యాయస్థానంలో ప్రతి మనిషి తన లెక్క చెప్పుకునేంత వరకు నిలబడి ఉండక తప్పదు. తన జీవితాన్ని ఎలా గడిపాడు? ఎలాంటి కార్యకలాపాల్లో నిమగ్నమై ఉండేవాడు? యవ్వన దశలోని శక్తిసామర్థ్యాలను ఎలాంటి పనులలో వెచ్చించాడు? ఎలాంటి పద్ధతుల ద్వారా సంపదను ఆర్జించాడు? ఆ సంపదలను యేయే మార్గాలలో ఖర్చు పెట్టాడు? జీవితానికి సంబంధించిన స్పృహ, బాధ్యతలు, కర్తవ్యాలు, ధార్మికంగా నిషిద్ధాలు, అనుమతులకు సంబంధించి తనకు తెలిసిన విషయాలను ఎంత వరకు ఆచరించాడు? తదితర ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోవలసి ఉంది. మనిషి తన ఈ బాధ్యతాభారాన్ని వేరెవరి నెత్తిన పెట్టలేడు. మనిషి బంధు మిత్రులు, సన్నిహితులెవ్వరూ ఆ రోజున అతనికి సహాయం చేయలేరు.

ఈ విస్తృతమైన శిక్షణా వ్యవస్థ మనిషి వ్యక్తిత్వ నిర్మాణంలో గొప్ప పాత్ర పోషిస్తుంది. కాని ఈ విస్తృత శిక్షణావ్యవస్థలో ఒక చెడు ప్రవేశిస్తే ఇక అందులోని మంచితో పాటు ఆ చెడు కూడా కలగలిసిపోతుంది. ఈ చెడు మనిషిపై తన ప్రభావాన్ని వేస్తుంది, దీని ప్రభావం నుంచి సురక్షితంగా ఉండడానికిగాను మనిషిలో తగిన స్పృహ, చైతన్యం ఉండాలి. మరో విషయం ఏమంటే ఈ శిక్షణా వ్యవస్థ మనిషికి ఎంతో మేలు చేసేది అయినప్పటికీ, కొన్ని విషయాలు, కొన్ని సంప్రదాయాలు, భావావేశాలు, ప్రమాణాలు, విలువలను మనిషికి నేర్పినప్ప టికీ, మనిషి ఆలోచనల రీత్యా, ఆచరణల రీత్యా మంచి మనిషిగా మారాలంటే స్వంత సంకల్పం ఎంతయినా అవసరం.

స్వీయ సంస్కరణ విషయంలో మనిషికి బయటి నుంచి లభించే ఒక సహాయం - మనస్తత్వ సమీక్షకు సంబంధించినది. మనస్తత్వ సమీక్ష ద్వారా మనిషి తన అంతరంగంలోని చెడులను గురించి తెలుసుకోగలడు. కాని మనిషిలో సంస్కరణకు సంబంధించిన దృఢ సంకల్పాన్ని పుట్టించే శక్తి దీనికి కూడా లేదు.

స్వీయ సంస్కరణకు సంబంధించి బయటి నుంచి లభించే ఈ సహాయా లన్నీ మనిషికి ఎంతయినా ప్రయోజనకరమైనవే, ఎంతయినా అవసరమైనవే, కాని ఇవేవి ప్రాథమిక బాధ్యతను తగ్గించలేవు. మనిషిలో తన వ్యక్తిత్వాన్ని, నడవడిని చక్కదిద్దుకోవాలన్న చైతన్యం జాగృతం కానంతవరకు, చెడులకు దూరంగా ఉండాలన్న సంకల్పం జనించనంత వరకు ఇవేవీ ఉపయోగపడవు. యే చట్టమైనా, యే ఉపదేశమైనా, యే పాఠమైనా, ఎలాంటి మనస్తత్వ సమీక్షలైనా, ఎలాంటి సంస్కరణా వ్యవస్థ అయినా, ఎలాంటి శిక్షణా శిబిరమైనా మనిషిని మంచి మనిషిగా మార్చలేవు. మనిషిలో అంతరాత్మ నిద్రిస్తున్నట్లయితే, మనిషిలోని సంకల్ప శక్తి మొద్దుబారినట్లయితే బయటినుంచి లభించే ఈ సహాయసహకారాలన్ని నిరుపయోగమైపోతాయి. ప్రభావంలేనివిగా మిగిలి పోతాయి. మనిషిలోని శిక్షకుడు, కావలిదారు అయిన అంతరాత్మ నిర్జీవమైపోతే

బయటి శిక్షకుల ప్రయత్నాలు ఉపదేశాలు కేవలం వినడానికి తప్ప మరేలాంటి ఫలితాలు సాధించలేనివిగా మిగిలిపోతాయి. అలాంటి ఉపదేశాలను విన్న తర్వాత మనిషి ఆలోచనలు భావాలలో పెనుమార్పులు జనించే బదులు కేవలం కునికిపాట్లు వస్తాయి. అంతేకాదు బయటి కారణాల ప్రభావం వల్ల మనిషికి అలవడిన అత్యుత్తమ ఆచరణలు కూడా నిర్జీవమైన అలవాట్లు ఆచారాలుగా మిగిలిపోతాయి.

## స్వీయ సంస్కరణకు మొదటి దశ

మనిషిలో అతని మంచిచెడులకు, అతని సంస్కరణ, పతనాలకు బాధ్యత తనదే అన్న బాధ్యతాభావం జనించడమే సంస్కరణకు మొదటి దశ. మనిషిలో ఈ బాధ్యతాభావం జనించిన రోజున అతని వ్యక్తిత్వంలో ఒక విప్లవం ప్రారంభమవుతుంది. ఈ బాధ్యతాభావం జనించనంత కాలం మనిషి విశ్వాసం, నైతికతల రీత్యా పతనావస్థలోనే కొట్టుమిట్టాడుతుంటాడు. ఈ అవస్థలోనే జీవితకాలమంతా గడిచిపోతుంది. చివరకు అతని ఆత్మ ఇలా మొత్తుకుంటుంది:

"ఓ దైవమా! నాకు మరింత వ్యవధి ఇచ్చి ఉంటే నేను దానధర్మాలు చేసి ఉండేవాడిని, పుణ్యాత్ములలో చేరి ఉండేవాడిని."

షైతాను శక్తులు మనిషిలో ఈ బాధ్యతా భావాన్ని నిద్రపుచ్చడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తాయి. మనిషి మనసును అనేకానేక విధాల ప్రలోభాలకు గురిచేస్తాయి. మాయచేసి, మభ్యపుచ్చి అరచేతిలో స్వర్గాన్ని చూపిస్తుంటాయి. ఈ శక్తుల ప్రభావానికి గురిఅయిన వ్యక్తి తన బలహీనతలు, తన తప్పులు, తన లోపాల బాధ్యతను ఇతరులపై నెడుతుంటాడు. తప్పులు, బలహీనత లన్నీ ఇతరుల్లో, మిత్రులు సన్నిహితుల్లో, ఇంటివారిలో, జమాఅత్‌లోని తోటి సోద రుల్లో, సామాజిక వాతావరణంలో, రాజకీయ వ్యవస్థలో అతనికి కనబడుతుం టాయి. ఫలానా వ్యక్తి అలా చేయనట్లయితే తాను ఉపేక్ష చూపి ఉండేవాడిని కానని, ఫలానా పని జరుగకుండా ఉన్నట్లయితే తాను ఫలానా మేలు పొంది

నికిగాను చేసే చివరి ప్రయత్నం తనను బలవంత పెడుతున్నారని ఆరోపించడం. ప్రతి కాలంలోనూ ఇలాంటి వారు చాలా మంది కనబడతారు. తమ ఉదాసీన తను, తమ లోపాలను గుర్తించే బదులు విధిరాత గురించి చింతించిన వాళ్ళు చరిత్రలో చాలామంది కనబడతారు. ముఖ్యంగా ఎప్పుడైనా ఎవరైనా దైవభక్తుడు సంస్కరణ వైపునకు పిలిచినప్పుడు ప్రగతి నిరోధక వ్యక్తులు ఎల్లప్పుడు తమ పతనానికి కారణం విధిరాత అనే భావించేవారు. తమ అనాచరణలను కొనసాగించడానికి గాను సాకులు వెదికేవారు. తాము విశ్వసించి మంచి పనులు చేయాలని దేవుడు భావించి ఉన్నట్లయితే దేవుడు తన శక్తిని ఉపయోగించి తమను మంచి మార్గాన పెట్టేవాడని వాదించేవారు. దేవుడు ఇలా చేయలేదు కాబట్టి ఇక మనుషులు తమను మార్చే ప్రసక్తేలేదని అనేవారు.

మనిషి ఈ విధంగా తన వాదనను చాలా చాకచక్యంగా తయారు చేసు కుంటాడు. తాను వేయి నేరాలు చేసి కూడా ఒక బాధితునిగా న్యాయం కోరే వానిగా ముందుకు వస్తాడు. అనేక మందిని నేరస్తులుగా బోనులో నిలబెట్టడానికి ప్రయత్నిస్తాడు. తాను నిస్సహాయుడినని, అశక్తుడిననీ వాదిస్తాడు. అతడి చెడులు, తప్పులు, బలహీనతలు, అవివేకపు చేష్టలు అన్నింటికీ ఇతరులదే బాధ్యతగా భావిస్తాడు. తనకు అన్ని మినహాయింపులు, సడలింపులు కావాలి, తన విషయంలో ఇతరులు చూసీచూడనట్లు వ్యవహరించాలి. కాని ఇతరులకు మాత్రం అతడి భావాలోచనలు చాలా కఠినంగా ఉంటాయి. అతడి మాటతీరు కూడా చాలా మోటుగా ఉంటుంది. అతడి తర్కవాదాలు కూడా చాలా బలంగా ఉంటాయి. అతను చూపే నిదర్శనాలు ప్రమాణాలు కూడా చాలా ప్రభావ వంతంగానే ఉంటాయి. మనిషి భ్రమలలో బ్రతకడమే కాదు ఆ భ్రమలకు కూడా పాఠాలు చెబుతాడు. కాని ఈ భ్రమలు, ఈ ప్రపంచానికే పరిమితమైనవి. చివరకు మనిషి ఎలాంటి భ్రమలు మాయలు చెల్లని లోకానికి వెళ్ళవలసి ఉంది. అక్కడ అన్ని మాయలు భ్రమల జాలం ఛిన్నాభిన్నమైపోతుంది. అక్కడ మనిషి తన అంతరాత్మకు తానే బాధ్యత వహించవలసి ఉంటుంది. తన పనులకు తానే జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

మనిషి జీవితానికి సంబంధించిన పైన పేర్కొన్న పరిస్థితులు, అనుభవాలు, భావాలు, ఆలోచనలు వీటన్నింటికీ కారణం మనిషిలోని అంతరాత్మ, మనస్సాక్షి నిస్తేజంగా, నిర్వీర్యంగా, చైతన్యరహితంగా మారిపోవడమే. మనిషిలోని ఈ అంతరాత్మను జాగృతం చేయడానికి ప్రవక్తలు స్పష్టమైన ఉపదేశాలు ఇచ్చారు. ప్రతి మనిషి తన కోసం చేసుకున్నదే అతనికి లభిస్తుంది. అతడు చేసిన చెడులకు ఫలితాన్ని అతడు భరించవలసి ఉంటుంది. ఇతరులు చేసిన మంచి పనులు అతడి చెడులకు పరిహారం కావు. అలాగే ఇతరుల చెడులు అతడి మంచి పనులను నిష్ఫలం చేయలేవు. అక్కడి చట్టం ప్రకారం మా ఆచరణలు మాకు, మీ ఆచరణలు మీకు, ప్రతి మనిషి ఆచరణల ఖాతా ప్రత్యేకంగా ఉంది. పరలోకం అనబడే బ్యాంకులో ఒకరి పేర ఉన్న మొత్తాన్ని మరొకరు దొంగ చెక్కులతో తన సొంతం చేసుకునే అవకాశం లేదు. అలాగే ఎవరి ఖాతా ఖాళీగా ఉందో వాళ్ళు ఇతరుల ఖాతా నుంచి తన పేర బదిలీ చేయించుకునే అవకాశం కూడా లేదు. మనిషి స్వయంగా సంపాదించిన ఆచరణల సంపదే అక్కడి ఖాతాలో జమ అవుతుంది. ఇతరులు సంపాదించింది అతడి సంపదను అధికం చేయదు. ఇతరుల పరలోక ఖాతాల గురించి విమర్శించడం వల్ల అతడికి ఎలాంటి భాగం లభించదు. ఇదే సత్యం. దీనినే దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది. "ఎలాంటి విత్తు నాటుతారో అలాంటి ఫలమే దక్కుతుంది."

మనిషిలో ఈ బాధ్యతాభావం మేల్కొన్న రోజున మనిషి తన జీవితాన్ని చక్కదిద్దుకునే ప్రయత్నాలు ప్రారంభిస్తాడు. తన జీవితమనే చేనులో పసిడిపంటలు పండించడానికి ఒక రైతు మాదిరిగా శ్రమిస్తాడు. తన వ్యక్తిత్వమనే బంజరు భూమిపై నాగలి నడుపుతాడు. చెడు అలవాట్లనబడే బండరాళ్ళు పగులగొడుతాడు. అజ్ఞానం, అసత్యాల ముళ్ళపొదలు తొలగిస్తాడు. దైవికజ్ఞానం అనబడే నీటిని పెడతాడు. సత్సంకల్పాల విత్తులు నాటుతాడు. చివరకు పసిడి పంట వంటి వ్యక్తిత్వాన్ని సాధిస్తాడు. నెమ్మదిగా ధర్మపరాయణత అతనికి లభిస్తుంది. ప్రళయదినాన ఈ ఫలసాయం అతనికి లభిస్తుంది. అక్కడ శాశ్వత జీవితానికి కావలసిన ఆదరువు లభిస్తుంది.

ప్రవక్తల సంస్కరణా ప్రయత్నాలలోని ముఖ్యమైన అంశం ఇదే. మనిషి లోని బాధ్యతా భావాన్ని తట్టిలేపడం. చైతన్యాన్ని జాగృతం చేయడం. మనిషి అంతరాత్మలో ఈ బాధ్యతాభావం జాగృతమైతే అతడికి అదృష్టం వరించి నట్లే. ఈ బాధ్యతా భావం నిద్రిస్తున్నట్లయితే మనిషి అదృష్టం కూడా నిద్రమత్తు లోనే జోగుతుంది. ఈ బాధ్యతా భావాన్ని జాగృతం చేయడానికి విశ్వవ్యవస్థలో అనేక ప్రేరణలు, కారణాలు ఉన్నాయి. దీనిని జాగృతం చేయడానికి అనేక మానసిక, ఆధ్యాత్మిక అనుభవాలు, అనుభూతులు పని చేస్తున్నాయి. పతనం వైపునకు పయనిస్తున్న వారిని బాధ్యతల మార్గాన పెట్టడానికి దైవికమైన అనేక అవకాశాలు అందివస్తున్నాయి.

మనిషిలో తన మంచిచెడులకు తానే బాధ్యుడినన్న భావం జనిస్తే, తన అంతరాత్మను సచేతనంగా ఉంచాలన్న ఆకాంక్ష బలపడితే, తన మనసును మంచి ఆలోచనల నిలయంగా తానే మార్చుకోవాలన్న దీక్ష కలిగితే, తన ఆత్మను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్న సంకల్పం, తన వ్యక్తిత్వాన్ని తానే చక్కదిద్దుకో వాలన్న నిబద్ధత, తన జీవితాన్ని షైతాను శక్తులకు లొంగని జీవితంగా మార్చు కోవాలన్న నిర్ణయం బలపడితే అతడికి దైవిక సహాయం, దేవుని అనుగ్రహం ప్రాప్తమవుతాయి.

దేవుని దర్బారు వైపునకు నడువాలన్న సంకల్పం చేసుకున్న వారికే దేవుని మార్గదర్శనం కూడా లభిస్తుంది. ఈ బాధ్యతా భావం జాగృతమైతే వ్యక్తిత్వం లోనూ దానితో పాటు వికాసం చోటుచేసుకుంటుంది. ఈ బాధ్యతాభావం నిద్రమత్తుకు గురయితే వ్యక్తిత్వ వికాసం కూడా చతికిలబడి పోతుంది. అందు వల్ల ప్రతి మనిషి ఎల్లప్పుడు అంతరాత్మను సజీవంగా ఉంచడానికి ప్రయత్నిం చాలి. అంతరాత్మ నిద్రమత్తుకు గురవుతున్నదా అని నిఘా ఉంచాలి. అంతరాత్మ సచేతనంగా ఉన్న వ్యక్తి తన బాధ్యతలేమిటన్నది ఆలోచిస్తాడు. తాను ఎలాంటి నిర్లక్ష్యాన్ని, ఉదాసీనతను కనబరుస్తున్నది తెలుసుకుంటాడు. కాని అంతరాత్మ నిర్జీవమైపోతే ఆ వ్యక్తి ఇతరుల బాధ్యతలేమిటి, ఇతరులు కనబరుస్తున్న అలసత్వాలేమిటన్న విషయానికే అధిక ప్రాముఖ్యం ఇస్తాడు.

## స్థాయి హోదాల స్పృహ

మనిషి వ్యక్తిత్వ వికాసమన్నది అతనికి తన స్థాయి హోదాల గురించిన స్పృహ పూర్తిగా ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. మనిషి తన స్థాయి హోదాల గురించి తప్పు అభిప్రాయం కలిగి ఉన్నట్లయితే అతని ఆలోచనలు, అతని జీవితంలోని అన్ని రంగాలు అస్తవ్యస్తమైపోతాయి. మనిషి తన స్థాయి హోదాల గురించి తగిన అవగాహన కలిగి ఉన్నప్పుడే తన సంస్కరణకు తగిన విధంగా వ్యవహరించగలడు. విశ్వవ్యవస్థలో మనిషి తన ఉనికిని సరియైన విధంగా గుర్తించనంత కాలం అతడు అయోమయంలోనే తచ్చాడుతుంటాడు. తన ఉనికిని సరిగా గుర్తిస్తే సమతుల్యాన్ని, ప్రశాంతచిత్తాన్ని సాధించగలడు.

ఇస్లామ్ చేసిన గొప్ప మేలు ఏమంటే, మనిషికి అతడి వాస్తవ స్థాయి హోదాలను తెలియజేసింది. ఇస్లామ్ ప్రసాదించిన వాస్తవికతా జ్ఞానం ప్రకారం దైవం, విశ్వవ్యవస్థ, మానవాళి వీటన్నింటి మధ్య తన వాస్తవ స్థానాన్ని తెలుసు కోవాలంటే మనిషి క్రింది వాస్తవాలను గ్రహించాలి.

★ దేవుని ముందు మనిషి స్థానం ఒక ఆరాధకుని స్థానం

★ తోటి మానవులతో అతని సంబంధం సౌభ్రాత్రసమానత్వాల సంబంధం.

★ భౌతిక జగత్తుకు సంబంధించి దేవుని ప్రతినిధిగా మనిషి అధికారం కలిగి ఉన్నాడు.

దేవుని ముందు తన స్థానం ఒక ఆరాధకుని స్థానం అన్న వాస్తవాన్ని గుర్తించిన తర్వాత మనిషిలో గర్వం, అహం, విద్యాజ్ఞానాల అహంభావం, శక్తి సామర్థ్యాల పొగరు, దౌర్జన్యం, హింసాప్రవృత్తులు - మానవాళిని పతనం, నాశనాల వైపునకు తీసుకువెళుతున్న ధోరణులు దూరమవుతాయి. ప్రతి మనిషి దేవుని ఆరాధకుడే అన్న సామ్యం వల్ల మనుషుల్లో సౌభ్రాత్ర భావం జనిస్తుంది. జాతిపరమైన, భౌగోళికపరమైన, వర్గపరమైన నిమ్నోన్నతలు, అంతర్గత అలజడి సంఘర్షణలు తొలిగిపోతాయి. భౌతిక ప్రపంచం, అందులోని వనరులు, శక్తులు,

స్వభావసిద్ధంగా ఎదురయ్యే సమస్యలు, జీవితావసరాలు వీటన్నింటి నేపథ్యంలో మనిషి దేవుని ప్రతినిధిగా తన హోదాను గుర్తించినప్పుడు వీటన్నింటినీ వదిలి పలాయనాన్ని ఆశ్రయించి సన్యసించే ధోరణి నశిస్తుంది. మనిషి ఆత్మగౌరవం కూడా అధికమవుతుంది. దీనిపైనే మనిషిలోని బాధ్యతా భావం ఆధారపడి ఉంటుంది.

అయితే ఈ స్థాయీ హోదాల పరిమితిని అధిగమించి మనిషి అహం భావంతో దేవుని పరిధిలోకి అడుగు పెట్టడానికి ప్రయత్నించినా అతని వ్యక్తిత్వం నాశనమవుతుంది. అలాగే తన స్థాయీహోదాలకన్నా దిగజారి తన లాంటి మనుషులు, భౌతిక పదార్థాలు, అధికారం, ధనసంపదల ఆరాధకుడైపోతే కూడా మనిషి వ్యక్తిత్వం పతనమవుతుంది.

మనిషిలో అతని వాస్తవ స్థాయీహోదాల గురించిన స్పృహను బయటి నుంచి కలుగజేయవచ్చు. కాని అతడిని సరియైన స్థాయీ హోదాలపై నిల బెట్టడం, జీవితాంతం వాటికి కట్టుబడి ఉండేలా చేయడం అన్నది బయటి ప్రేరణల ద్వారా సాధ్యం కాదు. ఈ స్థాయీ హోదాలను నిలబెట్టుకుంటూ తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం, అనుక్షణం అటు ఆధిక్యతాభావానికి గాని లేక న్యూనతా భావానికి గాని గురి కాకుండా సమతుల్యాన్ని కాపాడుకోవడం ఒక పెద్ద పరీక్షే. ధార్మిక బోధనలన్నీ, నైతిక నియమావళులన్నీ, షరీఅత్ చట్టాలలోని సమస్త నిబంధనలు అన్నీ ఈ సమతుల్యాన్ని కాపాడడానికే ఉన్నాయి. కాని దీనిని కాపాడే చేయి, దానిపై నిఘా ఉంచే కళ్ళు బయటివి కావు, ఇవి మనిషిలో అంతర్భాగాలే. మనిషి సొంత చేతులు, సొంత కళ్ళే దీనికి భాధ్యత వహించవలసి ఉంటుంది. అందువల్ల మనిషి సంస్కరణకు బాధ్యత ఆ మనిషి పైననే ఉంటుంది.

## లక్ష్యం

మనిషి తన జీవితాన్ని కొనసాగించడానికి గాను అతనికి కొన్ని అభి రుచులు, అవసరాలు ఉంటాయి. ఈ అభిరుచులు, అవసరాలను పూర్తిచేయ

వలసి ఉంటుంది. కాని మనిషి కేవలం తన అభిరుచులు, అవసరాలను నెరవేర్చుకోవడంలోనే నిమగ్నమైపోతే, మనిషిలో నైతికత అన్నది మృగ్యమై పోతుంది. ఆధ్యాత్మిక చింతన అంకురించనే అంకురించదు. మనిషి తన అభిరుచులు, అభిలాషలను కొద్దోగొప్పో త్యాగం చేస్తూ కొన్ని బాధ్యతలను నెరవేర్చితేనే మనిషిలో నైతిక జీవితమన్నది మొలకెత్తుతుంది. మరో మాటలో చెప్పాలంటే, నైతిక జీవితమన్నది మనస్సును అదుపు చేయడంతో ప్రారంభమవు తుంది. మనస్సులోని కోర్కెలు చాలా వరకు మనిషిని పశువుగా మార్చుతాయి. కోరికలను ఒక అత్యున్నత లక్ష్యం కోసం త్యాగం చేయడం ద్వారా ఉన్నత స్థాయి జీవితం ప్రాప్తమవుతుంది. వ్యక్తిత్వాన్ని నిర్మించుకోడానికి, జీవితాన్ని చక్కదిద్దుకో డానికి, ఆధ్యాత్మిక నైతిక వికాసాన్ని సాధించుకోడానికిగాను మనిషికి త్యాగాలతో కూడిన ఒక లక్ష్యం, స్వార్థప్రయోజనాల కన్నా ఉన్నతమైన ఒక ఆదర్శం ఉండాలి. అలాంటి లక్ష్యం, ఆదర్శం లేనిదే మనిషిలో సచ్ఛీలం, ఆధ్యాత్మికత, నైతిక ఔన్నత్యం, వ్యక్తిత్వ నిర్మాణం, స్వీయసంస్కరణ సాధ్యం కాదు. మనిషి లక్ష్యం, ఆదర్శం ఎంత ఉన్నతంగా ఉంటాయో, ఎంత గొప్పగా ఉంటాయో అంత ఉన్న తంగా, అంత గొప్పగా మనిషి వ్యక్తిత్వం రూపుదిద్దుకొంటుంది. లక్ష్యం, ఆదర్శం ఎంత సంకుచితంగా, ఎంత పరిమితంగా ఉంటాయో అతని వ్యక్తిత్వం కూడా అంత సంకుచితంగా, పరిమితంగా మారిపోతుంది. సంకుచిత వ్యక్తిత్వం కలిగిన వ్యకి కేవలం ఒక పశువు మాదిరిగా తన అన్నపానాలు, లైంగిక అవసరాల కోసమే జీవిస్తాడు. అలాంటి వ్యక్తిలో సచ్ఛీలం, నైతిక ప్రమాణాలన్నవి కానరావు. వంశం, తెగ, జాతి, వర్గం, లేదా కనీసం ఒక ప్రత్యేక సంస్థ ప్రయోజనాల కోసం పనిచేసే వారు, వాటి కోసం త్యాగాలు చేసేవారు కాస్తయినా మెరుగు. అలాంటి వ్యక్తులలో పరిమితంగా అయినా సరే ఒక వ్యక్తిత్వం అన్నది ఉంటుంది. ఇస్లాం ముస్లిముల ముందు పూర్తి మానవాళి విస్తృత ప్రయోజనాల కోసం ఉమ్మడి ప్రయోజనాల కోసం పనిచేసే గొప్ప ఆదర్శాన్ని ప్రతిపాదిస్తుంది. ముస్లిముల దృష్టిలో ఎల్లప్పుడు దైవాభీష్టానికే అధిక ప్రాధాన్యం ఉండాలి. ఇస్లాం ప్రతిపాదించే ఈ ఉన్నత లక్ష్యాన్ని సరియైన విధంగా జీవిత లక్ష్యంగా మార్చుకుంటే మనిషి

వ్యక్తిత్వం అత్యున్నతంగా రూపొందుతుంది. ఈ లక్ష్య సాధనకు అవసరమైనంతగా మనోవాంఛల త్యాగం మరే లక్ష్యానికీ అవసరం లేదు. ఈ లక్ష్యం అన్నింటికన్నా విలువైనది.

ప్రతి లక్ష్య సాధనకు మనిషి కొన్ని నియమాలు, నిబంధనలు విధిగా పాటించవలసి ఉంటుంది. ప్రతి విధి నిర్వర్తించడానికి ఏదో ఒక దశలో త్యాగ నిరతి చూపవలసి ఉంటుంది. అందువల్ల విధిబాధ్యతల నిర్వహణ, మానసిక కోరికల మధ్య సంఘర్షణ ప్రారంభమవుతుంది. ఈ సంఘర్షణ మనిషి జీవితాన్ని ఒక పరీక్షగా మార్చుతుంది.

ఈ సంఘర్షణ ఈ పరీక్షలలో మనిషి ప్రతి క్షణం కీలక నిర్ణయాలు చేయవలసి ఉంటుంది. చేసిన నిర్ణయాలను ఆచరణలో పెట్టవలసి ఉంటుంది. పరీక్షలను ఎదుర్కోడం, సరియైన నిర్ణయాలు చేయడం, ఆ నిర్ణయాలను అమలు చేయడం ఈ క్రమంలో అగ్నిలో కాలి సమ్మెట పోటులు తిన్న ఇనుములా మనిషి వ్యక్తిత్వం వికసిస్తుంది.

పరీక్షా స్థితిని మనిషిపై రుద్దడం బయటి కారణాల వల్ల కాని పని. సంఘర్షణలో బాధ్యతా భావాన్ని మనిషిలో జనింపజేసే బాహ్యకారకాలు ఏవీ లేవు. బాధ్యతలు, కోరికల మధ్య జరిగే సంఘర్షణలో మనిషి అంతరంగంలో జరిగే నిర్ణయాలను గ్రహించే శక్తి ఎవరికీ లేదు. మనిషి అంతరంగాన్ని ప్రభావితం చేసి సరియైన నిర్ణయాలు తీసుకునేలా చేసే శక్తి కూడా ఎవరికీ లేదు. మనిషి నైతిక ప్రమాణాల రీత్యా చేసిన నిర్ణయాలను అమలు చేసేలా బయటి నుంచి అతడి మనస్సుపై ఒత్తిడి తీసుకురావడం కూడా సాధ్యం కాదు.

ఒక సైనికుని భావావేశాలు కలిగిన వ్యక్తి మాత్రమే జీవితాంతం కొనసాగే ఈ మంచి చెడుల సంఘర్షణలో గెలుపు సాధించగలడు. ఒక గార్డు మాదిరిగా తన విధిబాధ్యతలు, నియమాలను కాపాడుకొన్న వ్యక్తి మాత్రమే విజయాన్ని సాధించగలడు. ఒక మల్లయోధుని మాదిరిగా తన మనోకాంక్షలతో పోరాడే వ్యక్తి మాత్రమే వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోగలడు. మనిషిలోని ఈ సైనికుడు ఆయుధా

లను పారవేస్తే, అంతరంగంలోని గార్డు నిద్రపోతే, మల్లయోధుడు చతికిలబడితే ఆ వ్యక్తి జీవితంలో ఓడిపోయినట్లే. అతడి పోరాటాన్ని మరొకరెవరూ అతడి కోసం పోరాడే ప్రసక్తి లేదు. మరొకరు ఎవరూ అతడి అంతరంగంలో కావలి బాధ్యతలు నిర్వర్తించ లేరు.

ఒక లక్ష్యాన్ని ఖచ్చితంగా నిర్ధారించుకోవడం, ఆ లక్ష్యసాధనపై ఎల్లప్పుడు దృష్టి ఉండడం, ఆ లక్ష్యసాధనకు అవసరమైన నియమాలకు కట్టు బడడం, ఆ లక్ష్యానికి అనుగుణంగా తన కోర్కెలు, వాంఛలను త్యజించడం, ఆ లక్ష్య సాధనలో ఎదురయ్యే సంఘర్షణలను ఒక సైనికుని మాదిరిగా ఎదుర్కోవడం, ప్రతి పరిస్థితిలోనూ దృఢంగా నిలబడి ఉండడం - ఇది ప్రతి మనిషి స్వయంగా నిర్వర్తించవలసిన బాధ్యత. ఈ బాధ్యతను ఒకరి కోసం వేరెవరూ నిర్వర్తించలేరు.

ఇస్లామ్‌ను జీవిత మార్గదర్శిగా చేసుకున్న వ్యక్తి ఒక అత్యున్నతమైన లక్ష్యాన్ని నిర్ధారించుకున్నాడు. ఆ లక్ష్యం దైవ ప్రీతిని పొందడం. అందుకుగాను పూర్తి మానవాళి సంక్షేమాన్ని అభిలషించడం. ఈ అభిలాష నెరవేరడానికి గాను సత్యధర్మాన్ని సంపూర్ణంగా స్థాపించడం. సత్యధర్మవికాసానికి ప్రయత్నించడం. ఈ విధంగా ఆ వ్యక్తి తనపై అనేక బాధ్యతలను నిర్ధారించుకున్నట్లే. ఆ వ్యక్తి తనపై కొన్ని పరిమితులు, కట్టుబాట్లు విధించుకున్నట్లే. అతను మనోవాంఛల త్యాగాన్ని గుర్తిస్తాడు. తానే స్వయంగా ఒక పరీక్షాస్థితిని సృష్టించుకుంటాడు. అలాంటి వ్యక్తి తనకు ప్రతి రోజూ ఎవరో ఒకరు తాను ముస్లిమునన్న వాస్తవాన్ని గుర్తుచేయాలని అనుకుంటాడా! తన జీవిత లక్ష్యం దైవప్రీతిని పొందడమని ఎవరో ఒకరు చెబుతూ ఉండాలా! అతడి బాధ్యతలు, విధుల జాబితాను ప్రతి రోజూ ఎవరో ఒకరు చదివి వినిపించాలా! ఆయా బాధ్యతలు నిర్వర్తించడానికి త్యాగాలు చేయవలసి ఉంటుందన్న విషయాన్ని ఎవరో ఒకరు గుర్తుచేస్తూ ఉండాలా! హితబోధ, సహన బోధ అనేవి నిస్సందేహంగా ఇస్లామీయ సమాజం, లేదా ఇస్లామీయ జీవన వ్యవస్థలోని విశిష్టతలు. ఒక లక్ష్యానికి కట్టుబడిన వాళ్ళు తరచూ ఒండొరులకు హితబోధ చేయడం, ఉపదేశాల వాతావరణాన్ని సచేత

నంగా ఉంచడం అవసరం. కాని ప్రతి వ్యక్తి తన లక్ష్యనిబద్ధత, సంస్కరణకు ఇతరులపై ఆధారపడడం, తన బాధ్యతను తాను పూర్తి చేయక పోవడం జరిగితే హితబోధ, సహన బోధల వాతావరణమే ఏర్పడదు.

## నియమాలు, ప్రమాణాల అవగాహన

మంచిగా మారడానికి మంచి భావనలు ఉంటే సరిపోదు. వ్యక్తిత్వం, నడవడికలను చక్కదిద్దుకోడానికి ఒక స్పష్టమైన నియమావళి, ప్రమాణాల అవగాహన కూడా అవసరం. మంచి జీవితాన్ని గడుపాలని, చెడులకు దూరంగా ఉండాలని, ప్రగతి, నిర్మాణాల మార్గాన నడువాలన్న బలమైన వాంఛ ప్రతి కాలంలోనూ, ప్రతి ప్రాంతంలోనూ, ప్రతి పరిస్థితిలోనూ జాతుల్లో, వ్యక్తుల్లో సహజంగానే ఉంటుంది. కాని ఉన్నత జీవితాన్ని గడిపే మార్గం అస్పష్టంగానే ఉండేది. ఈ మార్గం స్పష్టంగా లేనప్పుడు మానవాళి అస్పష్టమైన ఊహాపోహల వెంట తచ్చాడుతూ తిరిగేది. స్పష్టమైన నియమావళి చేతికి అందిన కాలాలలోనే మానవాళి శ్రేయోసాఫల్యాలు పొందగలిగింది.

మానవాళికి ప్రవక్తలు(అ.స) చేసిన ఉపకారం ఇదే. వారు మేలు, శ్రేయో సాఫల్యాల స్పష్టమైన నియమావళిని మానవాళికి అందించారు. ఈ నియమా వళి సంపూర్ణంగా, సమగ్రంగా దివ్యఖుర్‌ఆన్ రూపంలో చివరి దైవ గ్రంథంగా మన ముందు ఉంది.

ఒక స్పష్టమైన నియమావళితో పాటు, ఆ నియమావళికి ఆచరణాత్మక ఉదాహరణ కూడా ప్రతి కాలంలోనూ మానవాళికి అవసరమయ్యింది. మనిషి హితబోధ పొందడానికి ఏదో సైద్ధాంతిక ఉపదేశం కన్నా ఆచరణాత్మక ప్రదర్శన వల్లనే అధిక ప్రయోజనం పొందుతాడు. కేవలం తార్కిక వాదోపవాదాల ద్వారా మనిషిలో విప్లవాత్మక మార్పులు రావు. మనిషిలో ఈ మార్పులు రావాలంటే ఆచరణాత్మక ఉదాహరణతో కూడిన హితోపదేశం అవసరముంటుంది. మనిషి భావావేశాలను గుర్తించే తర్కం, సాక్ష్యాధారాలు అవసరమవుతాయి. మరో

విధంగా చెప్పాలంటే ఏదో పుస్తకాలకు పరిమితమైన నియమావళి వల్ల మనిషి పూర్తి హితబోధను పొందలేడు. పుస్తకాల్లోని నియమావళికి సజీవ ఉదాహరణగా నిలిచే జీవితాన్ని ప్రత్యక్షంగా చూపవలసిన అవసరం ఉంటుంది. ఒక అత్యున్నత ప్రమాణబద్ధమైన జీవితం మనిషికి అవసరం. అలాంటి అత్యున్నత ప్రమాణబద్ధ మైన జీవితాన్ని మహాప్రవక్త ముహమ్మద్ (స) గడిపి ఆచరణాత్మకంగా చూపారు.

ప్రతి వ్యక్తి తన స్నేహితులు, తన ముహల్లా, తన పరిచయస్తులు, తాను ఉంటున్న సమాజంలోని ప్రముఖ పౌరులు, చారిత్రక వ్యక్తుల జీవితాల నుంచి తన కోసం కొన్ని ఆదర్శాలను కొన్ని ఉదాహరణలను ఎన్నుకుంటాడు. కొన్ని ప్రమాణాలను నిర్ధారించుకుంటాడు. వాటికి అనుగుణంగా తన నైతిక ప్రమాణా లను, నిత్యజీవితంలో వ్యవహారాలను, తన ఆచరణలను, మాటతీరును, చివరకు తన వస్త్ర ధారణ శైలిని అన్నింటిని అసంకల్పితంగానే అనుసరిస్తుం టాడు. ప్రత్యేక అలవాట్లు, మాటతీరు, కొన్ని ప్రత్యేక పదబంధాలు, ప్రత్యేక ఉచ్చారణ, అదే విధంగా సంతోషవిషాదాలు, ఆగ్రహ ఆనందాలు, రాగద్వేషాల వ్యక్తీకరణలోనూ మనిషి తాను ఆదర్శంగా ఎంచుకున్న వారిని అసంకల్పితంగానే అనుసరిస్తుంటాడు. ఈ విధంగా మనిషి ఎలాంటి ఆదర్శాన్ని తన కోసం ఎంచుకున్నాడో అలాంటి వ్యక్తిత్వాన్నే పొందుతాడు. కొందరికి సినిమా హీరోల వ్యక్తిత్వం ఆదర్శదాయకమైనది కావచ్చు, కొందరికి ప్రముఖ కవి రచయితలు ఆదర్శం కావచ్చు. కొందరికి ఏదన్నా ప్రత్యేక నవలలోని హీరో ఆదర్శం కావచ్చు. కొందరికి క్రికెట్ లేదా హాకీ వంటి క్రీడల క్రీడాకారుడు ఆదర్శం కావచ్చు. కొందరికి పేరుప్రతిష్టలున్న ప్రభుత్వ అధికారులు ఆదర్శం కావచ్చు. లేదా రాజకీయ నాయకులు, మంత్రులు ఆదర్శం కావచ్చు. కొన్ని సందర్భాల్లో మనిషి పాటించే ప్రమాణాలు, విలువలు వివిధ వ్యక్తిత్వాల పరిధులకు విస్తరించి ఉండవచ్చు. మనిషి విభిన్న రంగాలకు సంబంధించి విభిన్న వ్యక్తులను అనుసరిస్తూ ఉండ వచ్చు. మనిషి పూర్తి జీవితంలో విశ్వ కారుణ్యమూర్తి ముహమ్మద్ (స) వంటి మచ్చలేని అత్యున్నత వ్యక్తిత్వాన్ని తనకు ఆదర్శంగా చేసుకోవాలని ఇస్లాం

అభిలషిస్తుంది. మనిషి జీవిత రంగాలన్నింటా ఆయననే ఉదాహరణగా చేసుకుని అనుసరించాలని కోరుతుంది. మనిషి వ్యక్తిత్వానికి ఇది ఒక్కటే అత్యున్నతమైన ఉదాహరణ. ఈ ఉదాహరణను ఆదర్శంగా చేసుకుని నైతికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. ప్రవక్త ముహమ్మద్ (స) వ్యక్తిత్వాన్ని ఆయన ఆచరణలను, ప్రవచనాలను సంపూర్ణంగా మన ముందు ఉంచుతున్నాయి హదీసులు. ప్రవక్త సంప్రదాయాల పూర్తి రికార్డు సున్నతుల రూపంలో మన ముందు ఉంది. చరిత్రలో ఆ అత్యున్నత వ్యక్తిత్వం గురించిన పూర్తి వివరాలు లభ్యమవుతున్నాయి.

ఇస్లాం ప్రతిపాదించే నియమావళిని, ప్రమాణాలను మనం దివ్య ఖుర్ఆన్, హదీసుల ద్వారా తెలుసుకోగలం. దివ్య ఖుర్ఆన్, హదీసుల జ్ఞానాన్ని పొందడం ప్రతి ముస్లిం స్త్రీ పురుషులకు తప్పనిసరి విధిగా నిర్ధారించింది ఇస్లాం. ఈ ధార్మిక జ్ఞానాన్ని పొందడానికి మనిషి అరబీ భాషను నేర్చుకోవడం అవసరమవుతుంది. ఆ విధంగా మనిషి ప్రత్యక్షంగా అరబీ గ్రంథాల నుంచి ప్రయోజనం పొందవచ్చు. అలా చేయలేనట్లయితే అనువాదాలు, భావవివరణ గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. వాటి నుంచి ప్రయోజనం పొందవచ్చు. ఖుర్ఆన్ పాఠాలు, ప్రసంగాలకు హాజరయి కూడా ప్రయోజనం పొందవచ్చు. కాని ఈ విద్యాజ్ఞానాలు పొందాలన్న కాంక్ష మనిషిలో ఎంత ఉందన్నది మనిషి స్వయంగా తానే గుర్తించాలి. అలాగే మనిషి తాను పొందిన విద్యాజ్ఞానాలకు అనుగుణంగా తనను తాను ఎంత వరకు సంస్కరిస్తాడన్నది కూడా మనిషి పైననే వ్యక్తిగతంగా ఆధారపడి ఉంది. ఈ విద్యాజ్ఞానాలు పొందాలన్న తపన లేనట్లయితే, మనిషి చుట్టూ ఆ విద్యాజ్ఞానాల నదులు ప్రవహిస్తున్నప్పటికీ ఒక్క గుక్క కూడా తాగలేడు. ఎలాంటి వాడు అలాగే ఉంటాడు. మనిషిలో ఈ విధమైన జడత్వం చోటు చేసుకున్నట్లయితే బయటినుంచి బలవంతంగా అతడిలో విద్యాజ్ఞానాలను నింపడానికి ప్రయత్నించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం ఉండదు.

ప్రమాణాలు, నైతిక నియమాలకు సంబంధించిన తపన తనలో సచేత

నంగా ఉంచడమన్నది ప్రతి మనిషి వ్యక్తిగత బాధ్యత. అలాగే తాను పొందిన జ్ఞానానికి అనుగుణంగా ఆచరణలను సంస్కరించుకునే వైఖరికి ప్రతి మనిషి వ్యక్తిగతంగా కట్టుబడాలి.

## ఒకే సంకల్పం, ఒకే నిర్ణయం

మనిషి మనస్తత్వాన్ని మనం లోతుగా పరిశీలిస్తే, మనిషి జీవితంలోని విస్తృతమైన విప్లవం గాని, లేదా పరిమితమైన మార్పులు కాని ఏవయినా సరే ఒక సంకల్పం లేదా నిర్ణయం కారణంగానే ఉనికిలోకి వస్తాయి. ఒక దృఢమైన సంకల్పానికి రానంతవరకూ, సంకల్పబలం మనిషిలో శిలాసదృశంగా మార నంతవరకూ అతడిలో నైతిక విప్లవం అన్నది రాదు. మనిషి అనేక విషయాలను మెచ్చుకుంటాడు, మాటవరుసకు కొన్ని విషయాలు పాటించడం చాలా అవసర మని కూడా ఒప్పుకుంటాడు. కాని వ్యక్తిగతంగా వాటిని ఆచరించడానికి సిద్ధం కాలేడు. అలాగే అనేక విషయాలను చెడు అని భావిస్తాడు. అలాంటి చెడులకు దూరంగా ఉండాలని ఒప్పుకుంటాడు. కాని వ్యక్తిగత ఆచరణలో ఆ చెడులకు దూరంగా ఉండే ప్రయత్నాలే చేయడు. ఈ ధోరణికి కారణం మనిషి గట్టిగా సంకల్పించుకోక పోవడమే. ఊగిసలాటలో ఉండిపోవడమే. స్వయం సంస్కరణ కుగాను మొదటి అవసరం మనిషి తన విద్యాజ్ఞానాల ప్రకారం తన అవగాహన ప్రకారం ప్రతి విషయంలో ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలి. బలమైన సంకల్పాలు చేయగలిగే శక్తిసామర్థ్యాలను తనలో అభివృద్ధి చేసు కోవాలి.

దైవానికి, దైవ ప్రవక్త(స)కు విధేయత చూపుతూ ఇతరుల శ్రేయాన్ని అభిలషించే విధంగా, ప్రపంచంలో శ్రేయోసంక్షేమాలను వృద్ధి చేసే విధంగా మనిషిని రూపొందించాలని కోరుతుంది ఇస్లాం. ఇలాంటి వ్యక్తిత్వం మనిషిలో ఏర్పడాలంటే ఆ మనిషి ఒక ఖచ్చితమైన సంకల్పాన్ని చేసుకోవాలి. ఇక నుంచి తాను ఎలాంటి చెడు తలపులు మనసులోకి రానివ్వననీ, ఎలాంటి చెడు పనులు చేయననీ, ఇకనుంచి తాను మానవాళి శ్రేయోసంక్షేమాల కోసం పని

చేస్తాననీ, మానవాళి శ్రేయోసంక్షేమాలకు నష్టం కలిగించే పనులేవీ చేయననీ, ఇక నుంచి తాను సమాజానికి మేలు చేస్తానని, సమాజంలో రుగ్మతలు పుట్టించే పనులేవి చేయనని దృఢమైన సంకల్పం చేసుకున్న వ్యక్తిలో మాత్రమే ఆ ఉన్నత వ్యక్తిత్వం ఏర్పడుతుంది. మహాప్రవక్త ముహమ్మద్ (స) సందేశాన్ని విని తక్షణం స్వీకరించిన ఆయన అనుచరులు అలాంటి దృఢమైన సంకల్పం చేసుకున్న వ్యక్తులే. ఆ సంకల్పానికి గట్టిగా కట్టుబడిన వ్యక్తులు వారు. వారికి అనేక ప్రలో భాలు, ఒత్తిళ్ళు ఎదురయ్యాయి. అయినా వాళ్ళు ప్రలోభాలకు ఒత్తిళ్ళకు ఏ మాత్రం లొంగిపోలేదు. వారు ఎంత దృఢంగా నిలబడ్డారంటే చివరకు అసత్య వ్యవస్థను కుప్పకూల్చారు. తినడానికి ఖర్జూరాలు తప్ప మరేవీ లేని వ్యక్తి ఇలాంటి సంకల్పం చేసుకుని దానికి దృఢంగా కట్టుబడి, తుదకు తాను చేసుకున్న సంకల్పానికి కట్టుబడుతూ ధర్మయుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వ్యక్తి సంకల్పబలం ఎలాంటిదయి ఉంటుందో ఒకసారి ఆలోచించండి.

కాని మన పరిస్థితి ఏమిటి? ఇతరుల వ్యవహారశైలి నచ్చకపోతే చికాకు పడుతాం, వారి తప్పులు ఎన్నడానికి సిద్ధంగా ఉంటాం. బస్సుల్లో తొక్కిస లాటలు, రోడ్డులపై, వీధుల్లో చెత్త పారవేయడం, కరుకుగా, పరుషంగా మాట్లా డడం, ఇతరుల మనసులు గాయపరచడం, చెడు చూపులు, చెడు చేష్టల వల్ల అందరికీ కష్టం కలుగుతుంది. కాని ఈ పనులు చేసేది ఎవరు? మనమే గొడవలు పడతాం, మనమే చెత్తచెదారాలు వీధుల్లో వేస్తాం. మాటలు, చేష్టలు, చూపులను మనమే అదుపులో ఉంచుకోము.

ఉన్నత చదువులు చదివిన తర్వాత, పెద్దపెద్ద డిగ్రీలు పొందిన తర్వాత కూడా ప్రగతిశీల భావాలు గలవారిగా అభివృద్ధి చెందిన తర్వాత కూడా ఇదే వైఖరి కనబడుతుంది. కుటుంబ వ్యవహారాల్లో, సామాజిక వ్యవహారాల్లో, ఈ లోపాలు కనబడుతూనే ఉండడం మన దురదృష్టం. అజ్ఞాన కాలంనాటి వైఖరులే నేడు కూడా కానరావడం చింతించదగిన విషయం. మంచి మంచి పుస్తకాలు చదువు తారు, అనేక గొప్ప గొప్ప ప్రసంగాలు వింటారు, కాని నైతిక సరళిలో, వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు ఉండదు. అత్యంత శోచనీయమైన జడత్వం ఇది.

ఉన్నత వ్యక్తిత్వాన్ని సాధించే వైఖరి ఇది కాదు. ఏదన్నా చెడు గురించి తెలిసిన మరుక్షణం ఇక నుంచి అలాంటి చెడులకు దూరంగా ఉండాలని బలంగా నిర్ణయించుకునే వ్యక్తులే గొప్ప వ్యక్తిత్వాన్ని నిర్మించుకోగలరు. దీనికి గొప్ప ఉదాహరణ మదీనాలో ప్రవక్త కాలం నాటి ప్రజల జీవితాలు. మద్యం నిషిద్ధం అన్న ఆదేశాన్ని విన్న వెంటనే నోటి వద్ద ఉన్న మధు పాత్రలను గిరాటు కొట్టారు వాళ్ళు. అలాగే పరదాకు సంబంధించిన ఆదేశం వినగానే అప్పటి మహిళలు తక్షణం ఆ ఆదేశాన్ని శిరసావహించారు. ఒక చెడును చెడుగా గుర్తించిన తర్వాత కూడా దానిని వదలని వ్యక్తి, ఏదన్నా నైతిక ప్రమాణాన్ని పాటించడం అవసరమని తెలిసిన తర్వాత కూడా దానికి కట్టుబడకుండా, 'అలా ఉంటే బాగుండు', 'ఇలా ఉంటే బాగుండు', 'ఇలా జరిగితే బాగుండు' అంటూ సాకులు వెదికే వ్యక్తికి ఎలాంటి పాఠాలు చెప్పినా, ఎలాంటి ఉపదేశాలు చేసినా ఎలాంటి శిక్షణ ఇచ్చినా, ఎలాంటి మంచి సంస్థతో అనుబంధం ఉన్నా ప్రయోజనం పొందలేడు. ఆ వ్యక్తి మానసికంగా, మేధోపరంగా జడత్వానికి గురయి ఉన్నాడు ఎవరైనా వచ్చి తనకు ఏదన్నా అద్భుతాన్ని ప్రదర్శించి తనను సంస్కరిస్తారని ఎదురుచూస్తూ గడిపేస్తాడు.

ఉన్నత స్థానం పొందాలంటే ప్రతి విషయంలోనూ స్పష్టమైన ఖచ్చితమైన సంకల్పం కలిగి ఉండాలి. చేసిన నిర్ణయాలే జీవితనియమాలుగా మార్చుకోవాలి. ఆ నియమాలకు కట్టుబడడాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలి. ప్రతి సంకల్పాన్ని పూర్తి చేయడానికి, ప్రతి నిర్ణయానికి కట్టుబడడానికి, ప్రతి నియమాన్ని పాటించడానికి అవసరమైతే త్యాగాలు చేయవలసి రావచ్చు. అలాంటి త్యాగాలు చేసినప్పుడే ఆ నియమాలు, ప్రమాణాల విలువ పెరుగుతుంది, అవి మనిషికి మరింత ఇష్టమైనవిగా మారుతాయి.

మనిషి వ్యక్తిత్వం అలవాట్లు, సంప్రదాయాల వల్లనే ఏర్పడుతుంది. మనిషి అలవాట్లు, జాతులు, వంశాల సంప్రదాయాలలో గొప్ప బలం ఉంటుంది. ఈ బలం ప్రత్యేక వ్యక్తిత్వ సరళిని పరిరక్షిస్తుంది. మనిషి ఒక పద్ధతిని

పదే పదే పాటించి దానికి పూర్తిగా అలవాటు పడిపోతాడు, అందుకు విరుద్ధంగా చేయమంటే తాను అలా చేయలేనని అంటాడు. అదేవిధంగా ప్రత్యేక నైతిక సంప్రదాయం కలిగి ఉన్న వంశం, లేదా సమాజంలోని వ్యక్తులను ఆ సంప్ర దాయానికి వ్యతిరేకంగా ఏదన్నా చేయమంటే తక్షణం తిరస్కరిస్తారు.

మనిషికి స్పష్టమైన, ఖచ్చితమైన నియమాలు ఉండాలి. ఖచ్చితమయిన సంకల్పం ఉండాలి. నేను ఫలానా పని చేస్తాను, ఫలానా పనులు చేయను అన్న తీర్మానం ఉండాలి. ఆ విధంగా ఆచరణలకు సంబంధించి పటిష్టమైన హద్దులు ఉండాలి. మనిషిలో మంచి చేయాలన్న శాశ్వతమైన అలవాటు, సంప్రదాయం స్థిరపడాలి. అందువల్లనే ఇస్లాం అప్పుడప్పుడు చేసే మంచి పనులకన్నా స్వల్ప స్థాయిలో అయినా సరే శాశ్వతంగా స్థిరంగా చేసే మంచి పనులకు అధిక ప్రాముఖ్యం ఇచ్చింది. చేసే మంచి పని ఏదైనా మనిషి వ్యక్తిత్వంలో అది ఒక భాగంగా మారిపోవాలి.

మనిషి మనస్సులో దృఢంగా సంకల్పించు కోవడం, తన సంకల్పాలను జీవిత నియమాలుగా మార్చుకోవడం, ఆ నియమాలను అలవాట్లుగా, సంప్రదాయాలుగా మార్చుకోవడం ప్రతి మనిషికి అతని వ్యక్తిగత బాధ్యత అన్నది స్పష్టం. బయటి ప్రేరణలు గాని, శక్తులు గాని మనిషికి ఈ పని చేసి పెట్టవు.

## ఆత్మజ్ఞానం

మనిషి తనను తాను తెలుసుకోకుండా తనను తాను సంస్కరించు కోలేడు. స్వీయ సంస్కరణకుగాను మనిషి తన్ను తాను తెలుసుకోవడం ఎంతయినా అవసరం. మనిషి తన అంతరాత్మను గ్రహించడం, దానిని అవ గాహన చేసుకోవడం ఎంతయినా అవసరం. ఆత్మజ్ఞానం అంటే మనిషి తన అంతరాత్మ స్వభావాన్ని తెలుసుకోవడం అని కూడా అర్థం చెప్పుకోవచ్చు. మనిషిలో మంచి చెడుల మధ్య జరిగే ఘర్షణను మనిషి గమనిస్తూ ఉండాలి. అంటే మనిషి తన అంతరాత్మపై నిఘా ఉంచాలి.

అంతరాత్మను మనం దాని మానాన దాన్ని వదిలి వేస్తే, అందులోని మంచి చెడు శక్తుల ఘర్షణను పట్టించుకోనట్లయితే, ఏ శక్తి బలంగా ఉంటే జీవితం ఆ దిశగా కొనసాగడాన్ని అనుమతిస్తే, అలాంటి ఉదాసీన వైఖరిలో సంస్కరణకు ఏమాత్రం అవకాశం ఉండదు. వ్యక్తిత్వ నిర్మాణానికి గాను అంతరాత్మను అరాచకానికి తావు లేని ఒక వ్యవస్థీకృత సామ్రాజ్యంగా మార్చ వలసిన అవసరం ఉంది. మనిషి అంతరంగంలోని ధోరణులు, వైఖరులు, భావాలు, అన్ని తమ తమ స్థానాల్లో సమతులంగా ఉండేలా జాగ్రత్త పడాలి. ప్రతి ఒక్క అంశానికి హద్దులు, పరిధులు, కట్టుబాట్లు ఏర్పాటు చేయాలి.

తన్నుతాను సంస్కరించుకోవాలని అభిలషించే ప్రతి వ్యక్తి తన బలహీనతలను గుర్తించడం అత్యంతావశ్యం. అనేక సందర్భాల్లో మనిషికి తన బలహీనత, లోపం ఏమిటో తెలుస్తూనే ఉంటుంది. కొందరిలో గర్వం ఉండ వచ్చు, కొందరిలో కోపం ఉండవచ్చు, కొందరిలో దురభిమానం ఉండవచ్చు, కొందరిలో లైంగిక బలహీనత ఉండవచ్చు, కొందరికి దుబారా, మరికొందరికి లోభత్వం ఉండవచ్చు. కొందరు వేర్పాటువాదులుగా ఉండవచ్చు, ఇలా అనేక విధాల బలహీనతలు ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా ఉండవచ్చు. మనిషి తనలోని ఇలాంటి బలహీనతలను గుర్తించడం, వాటిని తొలగించడానికి కృషి చేయడం వ్యక్తిత్వ నిర్మాణానికి ఎంతయినా అవసరం. మనిషి తన బలహీన తలను అలాగే వదిలివేస్తే, చివరకు అవి అతడి వ్యక్తిత్వాన్ని పూర్తిగా ఆక్రమిస్తాయి.

అన్నింటికన్నా ముఖ్యంగా మనిషి తన అంతరాత్మ, మనసు, మేధస్సుపై గట్టి నిఘా ఉంచాలి. ఇస్లామీయ షరీఅత్‌లో దీనినే ఖల్బ్ అంటారు. లేదా హృదయం. ఇక్కడి నుంచి భావాలు, అనుభూతులు, భావావేశాలు జనిస్తాయి. హృదయంలో చెడులు చోటు చేసుకుంటే పూర్తి వ్యక్తిత్వాన్ని అలుముకుంటాయి. అలాగే హృదయాన్ని సంస్కరిస్తే పూర్తి వ్యక్తిత్వం కూడా సంస్కరణ చెందుతుంది. హృదయం సంస్కరణ పొందితే మనిషి వ్యక్తిత్వానికి ఇదే కావలిదారుగా

మారుతుంది. ఇది కనుక చెడిపోతే బయటి ప్రయత్నాలేవి మనిషి వ్యక్తిత్వాన్ని చక్కదిద్దలేవు.

మనిషిలో చెడు ప్రారంభమైతే హృదయంలో ఒక నల్ల మచ్చ ఏర్పడుతుందని మహా ప్రవక్త ముహమ్మద్ (స) సెలవిచ్చారు. మనిషి దీనిని గుర్తించకపోతే, ఆ నల్ల మచ్చను తక్షణం ప్రక్షాళనం చేయకపోతే అది మరింత విస్తరిస్తుంది. చివరకు ఆ నల్ల మచ్చ పూర్తి హృదయాన్ని అలుముకుంటుంది. ప్రారంభంలో ఒక చెడు తలంపు, ఒక నీచమైన భావం, ఒక చెడుపని ఈ నల్ల మచ్చకు జన్మనిస్తాయి. ఈ నల్ల మచ్చను తక్షణం తొలగించనట్లయితే అది వ్యాపిస్తూ, పూర్తి వ్యక్తిత్వాన్ని నల్లబరుస్తుంది. సచేతనంగా ఉన్న హృదయం ఇలాంటి నల్లమచ్చను గుర్తించి తక్షణం పశ్చాత్తాప కన్నీళ్లతో కడిగేస్తుంది.

తన అంతరాత్మపై నిఘా ఉంచడం, తన బలహీనతలను గుర్తించడం, వాటిని తొలగించడానికి కృషిచేయడం, తన హృదయాన్ని పరిరక్షించుకోవడం ప్రతి వ్యక్తి వ్యక్తిగత బాధ్యత. ఈ బాధ్యతను అతనికి బదులు మరెవ్వరూ అతని కోసం నిర్వర్తించలేరు. మనిషికి ఇతరుల మద్దతు ఎంత అవసరమైనప్పటికీ మనిషి తన సంస్కరణ తానే చేసుకోవాలన్న నియమాన్ని పాటించనంతవరకు, తన వంతు బాధ్యతను పూర్తిచేయనంత వరకూ ఇతరుల మద్దతు వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు.

- : సమాప్తం : -